మగతజీవి చివరిచూపు

ఆరోజుకి, ముసురుపట్టాక మూడురాత్రులు గడిచాయి. సూర్యరశ్మికోసం ప్రాణాలు తల్లడిల్లుతున్నాయి. కాంతమ్మ పాకలో నీళ్ళునిలిచి, సామాన్లు పైకి తేలుతున్నాయి. బోషాణం పెట్టె సగందాకా నీళ్ళల్లోవుంది. తెల్లవారి ఏ కొద్దిసేపో వెల్తురు చిమ్మినా మళ్ళా నల్ల మేఘాలు ఆకాశాన్ని మూట కట్టినట్టు నలుప్రక్కలా చుట్టుకున్నాయి. కాంతమ్మ గుండెపై రాయిపడినట్టువుంది. ఐదేళ్ళ సుందరి కన్ను తెరవకుండా పడి వుంది. వళ్ళు వేడితగ్గినా పిల్ల కదలకుండా పడివుంది. పాపిష్టి దాన్ని ఎందుకు కొట్టినట్టు! తన దరిద్రానికి పసిదాన్ని నిందిస్తే అది ఏంచేస్తుంది—అని బాధపడుతోంది కాంతమ్మ. మోకాలి లోతు నీళ్ళల్లో నిల్చుని గోపయ్య, కాంతమ్మగోరో అంటూ కేకలు పెడుతున్నాడు. నీళ్ళల్లోకి దిగటం ఇష్టంలేక ఎందుకని బోషాణం పైనించే అడుగుతోంది.

ఎవరో ఎంకటేశులు అంటుండీ మీకోసం వచ్చారంట. పెద్దింట్లో వుండారు. మీ యల్లుడుగారు మిమ్మల్ని పిల్చుక రమ్మంటుండారు. నేను పోతుండా అని గోపన్న అరవటం దూరమవుతోంది.

వెంకటేశ్వర్లు పేరువినగానే వళ్ళు అంతా నీసుకారినట్లు అయింది. మళ్ళా ఇక్కడికి ఎల్లావచ్చాడన్న ఆశ్చర్యంతో మనస్సు కొంతసేపు మొద్దుబారింది. పక్కనవున్న సుందరి మొహంలో వెంకటేశ్వర్లు కనిపించాడు. వుద్రేకంతో పిల్ల పీక పిసకపోయి

తనతప్పు తెల్సుకుని వెనక్కి—జరిగి కూర్చుని మోకాళ్ళపై తలెట్టు కుంది. గతంలోకి మనస్సు వెడుతోంది. ఎంతకాదు అనుకున్నా ఆలోచనలు పెద్దపెద్ద ఆకారాలతో ఎదుట నిలుస్తున్నాయి. పిల్ల పుట్టుకల ముందుకి వెళ్ళింది మనస్సు.

ఆరోజు ఇల్లాగే వున్నపళంగా కుండపోతగా వర్షం కురు స్తోంది. గాదివోడ్లో తల ఆరుపెట్టుకుంటూ పంచలో మంచము చాటుగా ముక్కాలిపీటమీద కూర్చుని వర్షముధారలతో చూపుకలిపి కిందకీపైకీ చూస్తోంది. మబ్బుల్లో దాగిన నీరెండ మబ్బుల్లోనే దాక్కుని చీకటిని మబ్బులకి కప్పినట్లు, చుట్టూ నల్లగా చీకటిదిగుతోంది. జుట్టు పైకిమడిచికట్టుకు కొంగు నెత్తి పైకి లాక్కుంటోంది.

పదిబారల పెరడు దాటితేగాని ఇంట్లోకి వెళ్ళలేదు. తల మళ్ళా తడుస్తుందేమొ. పోనీ కొంచము వెలిశాక వెళ్ల వచ్చు అనుకుని పీటమీద చతికిలపడింది.

గాదివెనక ఏమిటో కదిలినట్టు అయింది. భయంతో కాళ్లుకూడా పీటపైన పెట్టుకు ముడుచుకు చుట్టూ చూస్తోంది. ఎవరో కళ్ళుమూస్తున్నారు. గట్టిగా అరిచింది. వర్షపుహోరు గోడలానిల్చి అరుపుని బైటకి వెళ్లనివ్వలేదు.

అరవకు నేనే—అంటూ వెంకటేశ్వర్లు ఇకిలిస్తూ జరుగు తున్నాడు.

ఛీ అంటూ విదిలించి పరుగుపెట్టింది. చీకట్లో మంచం కోడు తగిలి కిందపడింది.

నామాట వినకుండా వెడితే యింతేఅవుతుంది. చీకట్లో తడుముకుంటూవచ్చిన వెంకటేశ్వర్లుచేతిలో యిరుక్కుంది,

ఎంతో బతిమాలింది. తిట్టింది. గిల్లింది. మొండిఘటం ఛీ అస హ్యాంతో వళ్లు జలదరించి కళ్లు మూసుకుంది.

ఏం నీకొక్కదానికే మొగుడు నా కంటే చిన్న వాడేం కాదులే, అయితేమా నె, అల్లుడు ఇంట్లోనే వుంటాడుట, నీ కళ్ళతో కట్టేస్తావు మనసుని. ఇంకా ఏదో చెబుతూనేవున్నాడు. దూరంగా వర్షంలో మసగ్గా దీపపుకాంతి కదులుతూరావడం చూసి గాదినెక్కి తప్పుకున్నాడు వెంక టేశ్వర్లు. ఇంట్లోకి వెళ్ల కుండా నూతిలో దూకాలనిపించింది కాంతానికి. అంతదూరం నించే అమ్మాయి అని తండ్రిగొంతు వినపడగానే కొంగుకప్పుకు వర్షంలో తడుస్తూ యెదురెళ్లింది. తడుస్తూంటే మనస్సు కొంత తేలికయినట్టు తోస్తోంది. ఇదివరకు వానంటే భయం, చినుకులు పడితే ఏవో ముళ్లుగుచ్చుకున్నంత బాధగా అనిపించేది. వంట వసారాలో తల్లి ఎదురుచూస్తోంది. పిచ్చిమొహము, వానకి జడిసి గాదిదొడ్లో వుండిపోయినట్టు వుంది.

తల అంతా తడుపుకున్నావా? అత్తయ్యాని తుడవమను. ఆ మొహమంతా కాటిక అల్లా పూసుకొన్నావేమిటి! భూతక్కి బొమ్మలా, అంటోంది. అమ్మని తప్పించుకు సావిడిలోకి తప్పు కుంటూ, తలనొప్పి అని వంకపెట్టి వెళ్లి పడుకుంటే, బామ్మ సొంటిగంధం తీసుకువచ్చి గట్టిగా పట్టువెయ్యటం తెల్లవార్లు కంటిమీద కునుకులేకుండా మాటలు పెడుతూనే వుంది.

బయట వర్షపుగాలి ఎంత చల్లగా వేస్తున్నా వళ్లు మండటం తగ్గలేదు. ఎప్పుడో కునుకుపట్టింది.

సూర్యభగవానుడు కడిగిన అద్దంలా స్వచ్ఛంగా మెరిసి పోతూ తూరుపుకొండలపైకి ఎగబాకుతూ కాంతిని వెనక్కినెట్టి,

వేగంగా గమ్యంకోసం వెతుక్కుంటూ ముందుకివస్తున్నట్టు, కళ్ల ఎదట నిల్చి అంతలోనే జరిగి ముందుకి వెళ్లిపోయాడు. కాంతానికి వళ్ళుఅంతా నొప్పులు జ్వరం వచ్చినట్టువుంది. నిన్న వానలో తడిసిందామె కొద్దిగా పులకరంగాని తగిలి వుండవచ్చు అని బామ్మ నుదురుమీద చెయ్యేసి చూసి అంటోంది.

రెండురోజుల్లో జ్వరం తగ్గింది. లేస్తే కళ్ళు తిరగటం, ఏదో కడుపులో దేవటం తగ్గలేదు. పైత్యం ఎక్కువయింది అంటూ బామ్మ మాత్రలు చేసి వేసింది. గుళ్లోకి సాయంకాలా నికే అంతా వెళ్ళిపోయారు. చిన్న మేనత్తని సాయంపెట్టారు తనకి. దొడ్డి కిటికీలోంచి కాయితాలుచుట్టి ఎవరో వేస్తున్నారు. అన్నీ మేనత్త వడిలో పడుతున్నాయి. ఏమిటేటలవి అంటూ ఇప్పబోయింది. చూస్తానంటూ తీసుకొని అన్నీ అటేపడేసింది కాంత.

వెంకటేశులు పెరట్లోకి రమ్మనమని సైగ చేస్తున్నాడు.

ఇంతలో భజంత్రీలని తీసుకు పల్లకిని వెంటబెట్టుకు తల్లి వచ్చింది.

కాంతానికి మొదట ఈ పెళ్ళిఅంటే ఇష్టంలేకపోయినా వెంకటేశ్వర్లుకి దూరంగా వుండవచ్చునన్న ఆనందం వకటి కలిగింది.

తండ్రికికూడా ఈ పెళ్లి సుతరామూ ఇష్టంలేదు. తల్లి అయినా పెళ్ళికొడుకుని ముందు చూసివుంటే వప్పుకునివుండేది కాదేమో, ఎల్లాగయినా ఆడపిల్లవెపు బంధువులు పక్కకిజరిగి కళ్లు వత్తుకుంటున్నారు. పెళ్ళికుదిర్చినపెద్ద చిందులు తొక్కు తున్నాడు. ఏమయిందిఅంట. నిక్షేపంలాంటి సంబంధం? చిల్లి

గవ్వ కట్నంలేకుండా వచ్చింది. బోలెడు ఆస్తివుంది తెలుసా? అంటూ పళ్ళు కొరుకుతున్నాడు బావ్మపైన.

తంతు పూర్తవగానే ప్రయాణాలు అవమని తొందర పడుతున్నాడు అటునుంచివచ్చిన పురోహితుడు. మర్నాడుగాని పంపమని బావ్మ ఎదురుతిరగటంతో కొంచెము స్థిమితపడ్డాడు పురోహితుడు.

ప్రయాణంలో తోడుగా చిన్న మేనత్తని పంపారు. పెళ్లి కూతురికి వచ్చిననాడు ఇచ్చిన విడిదే ఆపాక. ముందు కొంచెము కష్టంగావున్నా నెమ్మదిగా అలవాటయింది.

మేనత్త నెమ్మదిగా పనివాళ్ళదగ్గర ఆరాతీసి తెల్సు కుంది. ముందున్న మేడా, భూమి, కూతురుపేర పెడితేకాని ఈ పెళ్ళికి వప్పుకోలేదట‌—మొదటి సంబంధంవేపు బంధువులు. ఆమాటవిన్న మేనత్తకి వర్షంకంటే ఎక్కువగా కంటిధారలు జారుతున్నాయి. కాంతానికి ధైర్యంచెప్పి వెళ్లిపోయింది. ఆ పాకలో అప్పటికేవున్న సామాన్లలో బోషాణం ఒకటి. విరిగిన మంచాలు చెక్క పెట్టెలుతో వారగా వున్నా వాటిజోలికి అట్టే ఎవరూ వెళ్ళరల్లేవుంది. దుమ్ముపడివున్నాయి. కాంతంవచ్చిన రెండురోజులకి ఒకసారి కూతురువచ్చి చూసి వెళ్ళింది. మరో రెండురోజులకి అక్కడికి రమ్మని కబురుపెడితే వెళ్లింది. అల్లుడు తన్నెంతో ఆదరంగా పలకరించటంచూసి కూతురుమొహం ముడుచుకుంది.

ఆరాత్రి ముసలాయన చాలాకోపంతో వచ్చాడు. అసలు అక్కడికి ఎందుకెళ్ళావు? ఈసారి వెడితే డొక్కచీల్చేస్తా

నంటూవచ్చి మంచంమీద కూలపడ్డాడు. కాంతానికి అర్థం కాక చూరుకిందకెళ్ళి కూర్చొని పెద్దింటిదీపాలకేసి చూస్తోంది. ఏమిటి అటు చూస్తున్నావు అప్పుడే అటుపడిందా నీదృష్టి అంటూ కాంతం రెక్కపుచ్చుకు ఈడ్చుకువచ్చాడు లోపలికి.

ఎందుకో(ప్పుడుతున్నాడో అర్థంకాక పోయినా ముసలాయనమీద జాలేసింది కాంతానికి. ఆపాకలో ఆరభసలో ఏళ్లు జరక్కపోయినా నెలలు గడిచాయి. వేసంగి ఎండలో పొలం వెళ్లి వచ్చిన ముసలాయన సంధ్యవేళ మల్లా తగూపెట్టుకున్నాడు. ఇప్పుడు నిజంచెప్పు, నీకు వాడితో . . . అంటూ పెద్దింటికేసి చూపెట్టి అడుగుతున్నాడు. కాంతం కళ్ళు అప్పచెప్పి చూస్తోంది. ముసలాయనకి కోపంతో వళ్ళు తెలవటంలేదు. మూలనున్న కఱ్ఱఎత్తాడు.

వెనకనించి ఎవరో పట్టుకున్నారు. నువ్వా, నువ్వా ఇక్కడే దాక్కున్నావన్నమాట అంటూ, అల్లుడుమీదకి వురికాడు. చీకటి చిమ్ముతున్న పెరట్లోకి దొర్లాడు. అంతే మరిమాటలేదు. మంచంలో కొన్ని నెలలుగడిపి బోషాణం పక్కన కళ్ళు మూశాడు ముసలాయన.

అప్పటినించీ ఆపాకే తనకి శరణ్యం. ఎన్నోరోజులు తినకపోయినా ఎవరూ అడగలేదు. పసిదానికి పాలులేకపోయినా బాధలేదు. పక్కపాకలో దూడలికి గుప్పెడు పచ్చిక దొరికేది. తనకీ పిల్లకీ ఎన్నో కరువయ్యేవి. అల్లుడు తలుచుకున్నప్పుడు విస్తరి దొరికేది. తండ్రి తీసుకెళ్లేందుకు ఎన్నోసార్లు ప్రయత్నించాడు. తనకే మనసు వప్పలేదు.

తిండికికూడా హీనపడతావనుకోలేదు అన్న తండ్రి మాటలకి కాంతం కళ్లు చమర్చాయి.

ఆమాటలు విన్న అల్లుడు, తిండికి ఏర్పాటు చేశాడు. కానీ పెద్దింట్లో అనుమానం మంటలా కాలుస్తోంది. నిత్యం అవే గొడవలతో తెల్లవారుతుందట. అల్లుడిని అంతా ఆడిపోసుకుంటున్నారుట. నిజంగా మనిషిఅంటే అల్లావుండాలి. తన్ని ఎంత గౌరవంగా చూస్తాడు. పిల్లంటే ఎంతజాలి. గుడ్డిలోకం మంచిని చెడుగా చెప్పుకుంటోంది. అన్నిమాటలు ఎల్లాభరిస్తున్నాడో మానవుడు. ఐనా తప్పుగా తనతో ఎప్పుడూ మాట్లాడలేదు.

వెంకటేశ్వర్లు వయస్సుని కండువాలా కప్పుకొని వైరాగ్యం కబుర్లు నోటినిండా నములుతూ పెద్దమనిషిలా ప్రతి మాటకి వుపమానంగా బోడిబుర్రని చూపెట్టి నాకేంకావాలి ఇంక అంటూ చప్పరించి వచ్చేపోయే పిల్లల్ని రహస్యంగా చూస్తూవుండటంతో పోల్చుకుంది. కానీ మంచివాడుగా చలామణి అవుతున్న వెంకటేశ్వర్లుని తను కాదంటేమాత్రం నమ్ముతారా?

అల్లుడుమంచి కూతురు ఎందుకు తెలుసుకోలేదో. డబ్బువుందన్న గర్వమైవుండాలి. అన్నీవున్నా వాళ్ళకి సుఖపడేరాత లేదు. ఎంతసేపయిందో తను అల్లాకూర్చుని. మెడ స్వాధీనం తప్పింది. కాళ్ళు తిమ్మిరెక్కాయి. పిల్లకేసి చూసింది. ఎల్లా పడివున్నది అల్లాగేవుంది.

పొద్దుతిరిగి వుండవచ్చు. వర్షం హోరు తగ్గినా వాన తగ్గలేదు. తీగెల్లా వానధార పడుతోంది. అరటి చెట్లబోదెల్లో

మురికి అంతా కొట్టుకుపోయి, తేటనీటితో తేలిగ్గా ప్రవహిస్తోంది. కాలంతో కలసి పాపంకూడా పల్చపడుతుందేమో.

ఏమండోయి అన్న సూరి అరుపుతోటి మళ్ళీ యథాస్థానానికి రాక తప్పలేదు కాంతానికి.

ఇందాక ఓసారి పిలిచారంటగా! మీ అమ్మాయిగోరు అగ్గిలయిపోతున్నారు. అల్లా ముడుసుక్కూకోపోతే ఎల్లి ఓముద్ద తినరాదటండీ! అని సలహా యిచ్చింది సూరి.

ఎక్కడో కఱ్ఱలు పెళపెళ్ళాడుతున్నాయి. పాకపైకి చూసిన సూరి అమ్మబాబో అంటూ నీళ్ళల్లోంచి అవతలికి పరుగెట్టింది. కాంతమ్మకి భయపడాలని వున్నా తన శరీరం స్వాధీనంలోకి తెచ్చుకునేసరికి తనేమైపోతున్నానో అన్నట్టు తోచింది. ఏమయినా పిల్లని బతికించుకోవాలి అనిపించింది. పొడిగుడ్డ తీసి కప్పింది. పిల్లని గుండెదగ్గరగా తీసుకుంది.

పాకపెంకు విరిగి కిందకి పడటం చూస్తూ నేవున్నా నోట మాటరాలేదు.

పిల్ల కంఠం కీచుమని అరిచి వూరుకుంది. ప్రాణం కిందికి దిగినట్లుతోస్తోంది. నీళ్లు వంటికి తగులుతున్నాయి. పిల్లని ఇంకా గట్టిగా పట్టుకుని ఊపిరిసలపక ఆయాసపడుతోంది కాంతమ్మ.

ఏవో కంఠాలు వినపడుతున్నాయి. నెమ్మదిగా పైకి లేపండి పాకని అంటున్నారు.

కదిపినపాక నేలమీదకి వరిగింది. పెనుగులాడుతోంది కఱ్ఱా కంపా తోటి.

కాంతమ్మకి తెలివివచ్చి కన్ను తెరచింది. అంతా చీకటిగా వుంది. దూరంగా ఎవరో కునుకుతున్నారు. వళ్లు అంతా ఏమిటో కట్లుకట్టారు. మళ్ళీ మగత వస్తోంది. వెలిగించిన వెల్తురిని యెవరో పైకి తోస్తున్నారు. తూర్పు ఆకాశం ప్రశాంతంగా తెల్లబట్టలు ధరిస్తోంది. రంగులు తెలవని పక్షులు గుంపులుగా పిల్చుకుంటూ వెడుతున్నాయి. స్పృహ వచ్చిన కాంతమ్మకి అవయవాల స్పర్శ స్పష్టంగా తెలుస్తోంది. చెవలకి చాలా చిన్నశబ్దంకూడా వినపడుతోంది. నెమ్మదిగా మాటలు వినపడుతున్నాయి.

నీకెందుకు ఈపీడ తండ్రిని వచ్చి తీసుకెళ్లమని కబురు పెట్టించు—ఆ కంఠం వెంకటేశ్వర్లుదే. సందేహం లేదు.

నేచెపితే వినదుగదా ఖర్మ. పోనీ మీరు చెప్పి చూడండి. ఆచెప్పేది అమ్మాయే ననిపించింది కాంతాకి.

ఇంతచక్కదనం నీకుండగా దానికోసం ఇదవడ మేమిటి ? మీ ఆయన నాకు నచ్చలేదు.

ఇది అంతా నాఖర్మ. ఏమిచెప్పను లెండి అని అమ్మాయి ఏడుపు వినిపిస్తోంది.

లాలింపుగా సకిలిస్తున్నది వెంకటేశ్వర్లేనేమో. కాంతమ్మ గోపన్నను పిలిచింది మెల్లగా. మళ్ళీ లోపలినించి మూడో కంఠము గట్టిగా వినపడుతోంది. అసలు మీకున్న వయసెంతో మీరుచేసే పని ఏమిటీ అంటూ గద్దిస్తున్న కంఠం అల్లుడిదే. హమ్మయ్య అనుకుంది కాంతమ్మ.

మంచివాడు అనుకుని కష్టం సుఖం చెప్పుకున్నాను అని సన్నగా ఏడుస్తోంది అమ్మాయి.

నాకు ఆవిడకు లేనివి కట్టి ఇద్దరూ ఆనందిస్తున్నారు అంతేగా!

ఆవిడ చిన్నప్పటినించీ అంతేట, అందుకే ముసలాడికిచ్చి కట్టబెట్టారు. ఆమాట నిజమే చెప్పాడు ఆ వెంకటేశ్వర్లు అని ఏగుప్పులోనే చెపుతోంది అమ్మాయి.

చూశాగా నిజాయితీపరుణ్ణి. చెప్పింది నమ్మాల్సిందే నేను సమయానికి రాకపోతే అంటున్నాడు. వూరుకోండి అల్లాంటి మాటలు అనకండీ అంటూ అమ్మాయి కంఠంలో హీనస్వరం పడింది.

చిన్నవయస్సులో వున్నా ఎప్పుడైనా వెకిలిగా ప్రవర్తించిందా? ఒక్కనాడయినా ఇదిలేదు కావాలని అడిగిందా? ఆమె తండ్రి రమ్మని బతిమాలినా ఆ పాకనిపట్టుకు వేళ్ళాడిందే కాని వెళ్ళిందా?

నీకు ఎప్పుడైనా ఆవిడనిచూసి జాలివేసిందేమో గుర్తుకు తెచ్చుకో ఇన్నేళ్ళనుంచి నీపక్కనే కాపరంచేసే ఆవిడగుణం. ఎవడో ముక్కూమొహం తెలియనివాడువచ్చి వాగినది పట్టుకొని ఆనందిస్తున్నావా? నిన్నుగురించి నేను అలాచెపితే నీకెలా వుంటుంది. అని అల్లుడు అడగటం, మనస్సులో ఎంతో తృప్తిగా వుంది కాంతానికి.

అవున్లెండి. కట్టుకున్నదనే గౌరవమైనా లేకుండా ఇష్టం వచ్చినట్లు అంటున్నారు. అనండి. మీకు ఏమీ లేకపోతే ఆవిడకోసం అంత ఇదవుతున్నారేం? ఈ మూడుపూటలు తిండైనా సరిగ్గా తిన్నారో లేదో ఆవిడ కాపలాయే సరిపోతుంది.

అని అమ్మాయి గట్టిగానే అంటోంది. ఒకవేళ ఆవిడ బతికినా పిల్లకనపడక గోలపెట్టి ప్రాణం విడుస్తుంది.

ఇంకా కొద్దిగా ప్రాణంవుంటే అది నువ్వు అనే మాటలలో పూర్తవుతుంది.

అందుకే వళ్ళుమండుతోంది. ఆవిడంటే మీకు ఎందుకు అంతజాలి అంటాను? అసలు నాకొంపలో ఆవిడ వుంటే నాకు మనస్థిమితం వుండదు తెలిసిందా! రేపే వెళ్ళకొడతా చూస్తూవుండండి. అని గట్టిగా అరచి విరుచుకుపడిపోయింది.

కాంతానికి దుఃఖం వచ్చినా కళ్లు నీళ్లతో నిండలేదు. పిల్ల ఏమయింది! అబ్బా మంట కడుపులో, ఏదో భగ్గుమన్నట్లు బాధగా వుంది. ఇక్కడినుంచి ఎందుకు తను వెళ్లిపోవాలి ఎక్కడికైనాసరే. తన మంచి ఒక్కమనిషి తెలుసుకున్నాడు. అదే తనజీవితానికి తృప్తి. లేచేందుకు ప్రయత్నించింది, కాళ్ల పైన ఏదో బరువు వుంది.

ఓ గోపన్నా నన్నుతీసుకెళ్లి ఏ పాడుపడ్డ కొంపలోనైనా పడెయ్యక ఇక్కడెందుకు వుంచారయ్యా అంటూ కాంతమ్మ ఏడుస్తోంది.

మత్తుకి మందు వేశారు, వూరిచివర సత్రంలోకి చేర్చారు కాంతమ్మని. సూరితల్లి దగ్గరే వుంటోంది. రోజులో చాలా భాగం మత్తులోనే గడుపుతోంది కాంతమ్మ.

ఆరోజు చాలా వుత్సాహంగా వచ్చింది కూతురు. సవతి తల్లిని పేరెట్టి పిలవటమే అలవాటు. కాంతం కాంతం ఈవింత విన్నావా, నీ పాకలోవున్న బోషాణంలో బోలెడు బంగారం నగలు దొరికాయి. అందుకే నేమొ నాన్న ఎప్పుడూ ఆచోటు

పదిలేవాడుకాదు. అని చెప్పుకుపోతోంది. మధ్యలో కాంతం వినటంలేదేమోనని అనుమానంవచ్చి వూపిచూసింది.

కదలటంలేదు. పలకటంలేదు. కాంతం కాంతం అంటూ మారుమోగేలా కేకలు పెడుతోంది.

సూరి తల్లిని తిట్టింది దగ్గరవుండి చూడలేదా, అని.

ఏమోతల్లీ నాకేటి తెలుస్తుందండీ. అయ్యాల మీతో మాట్టాడాడే ఆముసలాయన వచ్చి ఏదో అన్నాడండీ. గట్టిగా అరిచారండి అమ్మగోరు. ఆమందుసీసా తెరచి కొద్దిగా వంచుతూ అంతా అయ్యేదాకా పంచేశారండి. అమ్మగోరు ఎంటనే నిద్ర పోయారండి. మళ్ళీ లేవలేదండి–అని ముసిల్ది వూరుకుంది.

అయ్యో ఎంతపని జరిగిందే తొందరగా వెళ్ళి ఆ డాక్టరు గార్ని, అయ్యగార్ని పిల్చుకురా అంటూ గాభరాపెట్టింది.

డాక్టరుచూసి పెదిమవిరిచాడు. చాలా నీరసంగా వుంది పల్సు. తెలివిరాక పోవచ్చు అని నీళ్ళునమిలాడు. కూతురు నిజంగా దుఃఖిస్తోంది.

భర్తకేసిచూసి ఇంకా గట్టిగా ఏడుస్తోంది. ఏమిటూ మార్పు అన్నట్టు చూశాడు.

మీరు నవ్వండి. హేళనచెయ్యండి. కానీ నాకు మా కాంతమ్మ కావాలి. ఆవిడ లేకపోతే నాకు జీవితముమీద విసుగు పుడుతోంది. అసలు ఇక్కడికి మీరెందుకు పంపారు ఆవిడని? అంటూ భుజాలుపట్టుకు వూపుతోంది.

అర్థంకానట్టు ఆమెనుచూస్తూ నిల్చున్నాడు. నిజంగానే నండీ. ఆవిడని బతికించమని డాక్టరుతో చెప్పండి. ఇంకెప్పుడూ ఆవిడని యేమీఅనను. మీరు చెప్పినట్టు పెట్టుకుంటాను.

నేను వంటరిగా వుండలేకపోతున్నా ఆక్రోంపలోనని తన ఆవేదన చెప్పుకుని ఏడుస్తోంది.

ఇదేం చిత్రం! నీకు వుపకారం చేశానని నేను గర్వపడు తూంటే మళ్ళా ఈ పిచ్చిఏమిటి? అని వెంకటేశ్వర్లు గర్వంగా అంటూంటే, నువ్వెందుకు యిల్లా చేశావు? నిన్నెవరు చెయ్య మన్నారు ఈపని? అంటూ గట్టిగా అరచింది కూతురు. ఏ ఆశ పెట్టుకుని ఈపని చేసినట్లు? ఈపిల్ల ల్లా అరుస్తుం దేమిటి? అర్థంగాక వికటంగా నవ్వుతున్నాడు వెంకటేశ్వర్లు.

ఆ మొహంలో ఏదో వికృతరూపం కనపడి కెవ్వుమని కేకపెట్టి మూర్ఛపోయింది కూతురు.

నీళ్ళుజల్లి మొహం వత్తుతోంది సూరితల్లి. భర్తచెయ్యి గట్టిగా పట్టుకుంది–చూడండి నన్ను ముందు ఇంటికి తీసుకుపొండి. అతన్ని మన ఇంటికి ఎప్పుడూ రానివ్వకండేం, అంటూ పసి పిల్లలా కండువాలో మొహందాచుకు ఏడుస్తోంది.

వెంకటేశ్వర్లు వేదాంతి మొహం ఎరువు తెచ్చుకుని కాంతం కేసి చూస్తూ–"అంతా జరిగిపోయింది. కార్యక్రమం ఆలోచించండి," అంటూ తత్వాలు తవ్వుకుంటున్నాడు స్థిమితంగా కూర్చుని.

కాంతం మగతతో ఒకసారి కన్ను తెరచింది. పశ్చా త్తాపం తొంగిచూస్తున్న కూతురు మొహం ఆ పక్కనే జ్ఞానేం ద్రియాల్లా మెరిసిపోయే అల్లుడికళ్ళూ ఆ చూపులో కలిసి పోయింది. మగతజీవి మాలిన్యం కడిగినట్లు రెండు మేఘాలు చేరి సన్నజల్లులు జల్లాయి. ★

(5)